కథ

# విశాఖి

## రేణుక అయోల

"విశాఖా! దొడ్డమ్మ ఆచూకి దొరికింది", సంతోషంతో గట్టిగా పిలుస్తూ ఇంట్లోకి వచ్చాడు రమణ. ఇంట్లో అందరు ఉలికి పడ్డారు. గదిలో బట్టలు మడత పెడుతున్న 'విశాఖ' గబగబ నట్టింట్లోకి వచ్చింది. "ఎలా రమణా! ఎవరు చెప్పారు. ఎవరు వచ్చారు" ఆత్రంగా అడిగింది. "ఇందాక మా ఇంటికి ఫోను వచ్చింది. నెంబరు పిన్ని ఇచ్చిందట. పిన్ని రాయపూర్‌లోనే వుందిట. ఇందిరట ఆవిడ పేరు. ఆవిడకి నెంబరు ఇచ్చి మనకి చెప్పమని చెప్పిందిట!" కొద్దిగా ఆవేశంగా గబగబ మాట్లాడాడు కుర్చీలో కూర్చుంటూ... జేబులోంచి కాగితం తీసి విశాఖ చేతిలో పెడుతూ "ఇదిగో ఆవిడ నెంబరు..."


"ఇందిరామోహన్" అన్న పేరుతో పాటు కింద నెంబరువుంది. కళ్ళల్లో నీళ్ళు ఉరికాయి. ఎన్ని ఏళ్ళ నుంచి వెదుకుతోంది అమ్మ ఆచూకి కోసం.

"తాతయ్యా" అంది నెంబరు చూపిస్తూ. ఉయ్యాల బల్లమీద ఊగుతూ "రాయపూర్ వెళతావా" అడిగాడు..." "వెళతాను రమణని తీసుకుని వెళతాను" అంది స్థిరంగా.

"ఊరుకాని ఊరు. అక్కడ అంత హిందీ మాట్లాడుతారుట, నువ్వు వెళ్ళగలవా? పోనీ పెద్ద మామయ్యకి ఫోను చేద్దామంటే, వాడికి ఆ ఊరు నుంచి ట్రాన్స్‌ఫర్ అయిపోయిందిట. బాబాయి కాకినాడ నుంచి వచ్చేదాక ఉండకూడదూ" అంది అమ్మమ్మ.

"ప్లీజ్ అమ్మమ్మ! నేను ఇంక వుండలేను, రమణని తీసుకుని వెళతాను"?

"రామలక్ష్మీ- నువ్వు ఊరుకో. దాన్ని వెళ్ళనీ, మనం వద్దన్నా అది ఇక్కడ శాంతిగా వుండలేదు. రమణా టికెట్టు తీసుకోరా..." అన్నాడు తాతయ్య.



"తాతయ్యా! ఈ రాత్రికే వెళతాను. రమణ ప్లీజ్ చూడు. తత్కాల్‌నైనా అంది" ఆత్రంగా. "ఇదిగో ఇప్పుడే వెళతాను. టికెట్టు దొరుకుతుందిలే నువ్వేం బెంగపడకు. నాకు తెలిసినవాళ్ళు ఉన్నారు" అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు.

ఊహ తెలిసిందగ్గర నుంచి అమ్మ కోసం ఎదురుచూసేది. ఏవేవో అబద్ధాలు చెప్పి, అమ్మ ఇదిగో వస్తుంది, అదుగో వస్తుంది అనేవారు. చిన్నప్పుడు నిద్రబోయేముందు, తెల్లవారేసరికి అమ్మ ఇంట్లో వుండాలి అనుకునేదాన్ని. ఆ ఆశతోనే కళ్ళు తెరిచేదాన్ని. తరువాత తరువాత అర్థం అయిపోయింది అమ్మ ఇంక రాదని. నెలరోజుల పసిదాన్ని వదిలేసి, వెళ్ళిపోయిందని, నాన్నతో కాదు ఇంకెవరితోనో... అందరూ అనుకునేవారు. అమ్మ గురించి హేళనగా మాట్లాడేవారు. అమ్మమ్మ తాతయ్య కృంగిపోయారు. హిందీ దేశం వెళ్ళి చెడిపోయిందన్నారు. నాన్న వచ్చేవాడు గుర్తుంది, నల్లగా లావుగా చాలా భయంకరంగా వుండేవాడు. కాని ఇంట్లో అందరూ ఆప్యాయంగా చూసేవారు... అతను చాలాసార్లు కళ్ళనీళ్ళు పెట్టుకోవడం, అమ్మమ్మవాళ్ళు ఓదార్చడం చూసాను. నాన్నని మంచి అనుకోలేదు, అమ్మని చెడ్డ అనుకోలేదు. అమ్మని ఒక్కసారి చూడాలి, చచ్చిపోయేలోగా అనుకునేదాన్ని. ఇంత తొందరగానే అమ్మ ఆచూకీ దొరికింది.

ఇంటరు అయిపోయి, డిగ్రీ ఫైనల్స్‌లోకి వచ్చాను, ఇప్పుడు ధైర్యంగా అమ్మని అన్ని అడగగలను.

అమ్మ ఇంటర్ వరకు చదివాక హిందీ టీచర్ ట్రయినింగ్ అయింది. పెద్ద మేనమామ, రాయపూర్‌లో రైల్వేలో పని చేస్తున్నపుడు, అక్కడి స్కూల్లో హిందీ టీచరుగా ఖాళీలు వున్నాయంటే వెళ్ళిందని, ఆ స్కూల్ టీచర్ ప్రతాప్‌ని ప్రేమించిందని, అమ్మమ్మ వాళ్ళకి ఇష్టం లేకపోయినా పెళ్ళి చేసుకుందని, అమ్మమ్మ చెప్పినా, పిన్ని చెప్పినా ఇదే మాటిమాటికి వినేదాన్ని. పెద్ద పిన్ని పెళ్ళికని వచ్చి, అమ్మ ఉండిపోయిందిట, నేను పుట్టేదాక. నాన్న వచ్చి వెళ్ళావాడుట.

నెల రోజుల పసికందుని ఒదిలేసి ఎవరితోనో చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయిందంటారు. ఆ తరువాత నాన్న వచ్చి చెప్పేక తెలిసిందిట నాన్నతో వెళ్ళలేదని. అందరికి అవమానంతో తల కొట్టేసినట్లు అయిపోయింది. ఎవరితో వెళ్ళిపోయింది? పసిబిడ్డని కూడా ఒదిలేసి అంత మోహమా? ప్రేమా? దేనికి సమాధానం లేదు. కాలం

దార్లిపోయింది. నాన్న నా పోషణ గురించి కొన్ని ఏళ్ళు డబ్బులు పంపించేవాడుట... ఆ తరువాత అవి కూడా ఆగిపోయాయి.

ఆలోచనలు పరుగెడుతుంటే రమణ ఇచ్చిన ఫోన్ నెంబరు తీసుకొని S.T.D. బూత్‌కి వెళ్ళింది. ఇంట్లో ఫోను వున్నా S.T.D. పెట్టించలేదు తాతయ్య. అదనపు ఖర్చు అనుకుంటారు. అందరి చేతుల్లో సెల్‌ఫోన్ వున్న ఈ రోజుల్లో, ఇంట్లో ఎవరికీ సెల్ లేదు.

ఫోన్ రింగ్ అవుతుంటే మనసంతా ఆందోళన. "హలో" అన్నారు. "ఇందిర గారా? నేను అంటీ, మా అమ్మ గురించి ఫోన్ చేసారుట నిన్న... నా పేరు "విశాఖ..."

"ఆంటీ మా అమ్మ ఎలా వున్నారు?"


"మీ అమ్మగార్ని చూడలేదు. అసలు ఆ ఇంట్లో ఎవరైన ఉంటున్నారా అనుకునేదాన్ని. ఎప్పుడూ బయట తాళం వేసి వుండేది. నిన్న మీ అమ్మగారు ఏడుస్తూ పిలిచి, ఈ నెంబరు ఇచ్చి మీ ఇంట్లో చెప్పమన్నారు. ఆవిడ అలా రోజు ఇంట్లోనే వుంటుందిట. ఒక్కరోజు కూడా తెలియలేదు. ఎన్ని రోజులుగా బందీ చేసారో తెలియదు" దీర్ఘంగా నిట్టూర్చి "మీరు వీలైనంత తొందరగా రండి, వీలైతే రేపే రండి. మీ అమ్మ పరిస్థితి ఏమీ బాగోలేదని నాకనిపిస్తోంది. ఎడ్రస్ రాసుకో" అంటూ ఎడ్రస్ చెప్పారు... చేతిలో కాగితం మీద ఎడ్రస్, ఇంటివైపు నడుస్తుంటే కళ్ళకి ఏవీ కనిపించలేదు. కళ్ళనిండ నీటిపొర కమ్మేసింది. ఇప్పుడేం చెయ్యాలి. అమ్మని ఎలా రక్షించాలి. అసలు అమ్మ ఎవరి దగ్గర వుంది. నాన్నని ఒదిలేసి అతని దగ్గరకి వెళ్ళిందా? వాడు మోసం చేసాడా? వాడే ఇంట్లో నిర్బంధించి హింసిస్తున్నాడా?! ఆలోచనలతో తల పగిలిపోయింది.

ఇంటికొచ్చి అమ్మమ్మ తాతయ్యతో చెబుతుంటే, అమ్మమ్మ భోరున ఏడ్చింది. "బంగారం లాంటి పిల్ల దిక్కూ దివాణం లేకుండా మగ్గిపోతుంది" ఎవరికి భోజనం సహించలేదు.

రమణ వచ్చేసరికి ఎయిర్‌బ్యాగు సర్దుకున్నాను. తాతయ్య ఇచ్చిన డబ్బులు జాగ్రత్తగా పర్సులో పెట్టుకున్నాను. రమణ సెల్ నెంబరు తాతయ్యకి కనిపించేలా పెద్ద పెద్దగా రాసి ఫోన్‌కి ఎదురుగుండా పెట్టాను. అమ్మ దొరికింది అనగానే పిన్నులు, పెద్దమామయ్య ఫోన్లు చేస్తూనే వున్నారు.

రైలు వేగంగా వెళుతున్నా ఇంకా వేగంగా ఎందుకు వెళ్ళదు అనిపిస్తోంది. రమణ ఏదో మాట్లాడుతున్నాడు. ఏదీ వినిపించడం లేదు. వాడు నాతోటివాడే, ఇంజనీరింగ్ ఫైనల్స్‌లోకి వచ్చాడు. వాడికి కొద్దిగా హిందీ వచ్చు.

**భయంతో మాటిమాటికి గేటువైపు చూస్తూనే వున్నాను. తాళం తియ్యడానికి పదిహేను నిముషాలు పట్టింది. వాడికి పది రూపాయలు ఇచ్చి పంపించి తలుపు గడియ తీసారు. లోపలంతా చీకటి అన్ని తలుపులు మూసేసి వున్నాయి. ఆంటీ కిటికీ తలుపు తెరిచాక కనిపించింది అమ్మ.**



ఉదయం ఎనిమిది గంటలకి రాయపూర్ స్టేషనులో దిగుతుంటే కాళ్ళు వణికాయి. ఇందిరా ఆంటీ ఇచ్చిన ఎడ్రస్ చెప్పి ఆటోలో కూర్చున్నాం. ఆంటీకి ఫోను చేసి చెప్పాడు వస్తున్నట్లు. ఆంటీ చెప్పిన గుర్తులు పట్టుకొని, శంకర్‌నగర్ కాలనీకి వచ్చాము. అక్కడ 'తివారి కాంపౌండ్' అనగా అందరూ చెప్పారు ఎలా వెళ్ళాలో. కాంపౌండ్ గేటుదగ్గరే ఆంటీ, అంకుల్ నిల్చుని వున్నారు మా రాక కోసం.

ఆంటీవాళ్ళ ఎదురిల్లే అమ్మ వుంటున్న పోర్షన్. పెద్ద తాళం కప్ప వేళ్ళాడుతోంది. టీ, టిఫిన్ అయ్యేదాక ఆంటీ ఒప్పుకోలేదు, అమ్మని పలకరిస్తానంటే. "రాత్రంతా ఏం తిన్నారో! అసలు నిద్రపోయావా?" ఆప్యాయంగా అడుగుతుంటే వెర్రిదుఃఖం వచ్చింది.

అమ్మని చూడాలన్న కోరిక చిన్నప్పటి నుంచి. నన్నెందుకు వదిలేసావు అని అడగాలి, నీతోపాటూ తీసుకువెళ్ళాల్సింది కదా! నువ్వేం తింటే అదే తినేదాన్ని కదా! అసలు అల్లరి చెయ్యను, అనుకునేదాన్ని చిన్నప్పుడు అమ్మని తలచుకున్నప్పుడల్లా. తాతయ్య అమ్మమ్మ వున్నా, అల్లారు ముద్దుగా పెంచినా, అమ్మ, నాన్న ఇద్దరూ లేరు. అమ్మ మీద వున్న అపవాదు, బెంగతో కుంగిపోయేదాన్ని. మనసులో ఎనెన్నో ప్రశ్నలు, సందేహాలు.

ఒణుకుతున్న కాళ్ళతో రమణ, నేనూ, ఇందిరా ఆంటీ తాళం వేసి వున్న గుమ్మం ముందు నిలబడ్డాము.

"బెహన్‌జీ! బెహన్‌జీ! మీ అమ్మాయి వచ్చింది ఊర్నుంచి" అంటూ ఆంటీ తలుపు తట్టి పిలిచారు.

లోపలి నుంచి ఏ శబ్దం వినిపించలేదు. మళ్ళీ తలుపు తట్టారు.

తలుపు కింద నుంచి వేళ్ళు కదిలాయి. సన్నని మూలుగు.

గుండె ఆగిపోయినట్లు అనిపించింది. "అమ్మా అమ్మా' అంటూ ఏడుస్తూ గుమ్మ ముందు కూలబడిపోయాను.

"విశాఖ! నువ్విలా కంగారుపడితే ఎలా? ఏంచెయ్యాలో ఆలోచిద్దాం" రమణ నన్ను పట్టుకుని ఓదారుస్తూ.

"లోపల ఆవిడ పరిస్థితి ఏమీ బాగున్నట్లు లేదు. నేను తాళాలు తీసే అబ్బాయిని తీసుకొస్తాను" అంటూ అంకుల్ బైక్ మీద

వెళ్ళిపోయారు.

"అమ్మా" "అమ్మా" అంటూ పిలుస్తూనే వున్నాను. తలుపు కింది నుంచి మళ్ళీ వేళ్ళు కదిలాయి.

అసలు నాన్న ఎక్కడున్నాడు? నాన్నని పిలుస్తేనో... అసలు నాన్న వస్తాడా? అమ్మని అసహ్యించుకుని వెళ్ళిపోయాడా. వేరే పెళ్ళి చేసుకున్నాడా. కంగారులో నాన్న నెంబరు తీసుకురావడం మరచిపోయింది.

నాన్న వుంటే ఏమైన సహాయం చేసేవాడేమో! తలుపు తీసేదాకా అంత సవ్యంగా జరుగుతుందా? ఈ లోగా వాడు అమ్మని బంధించినవాడు వచ్చేస్తే?

భయంతో మాటిమాటికి గేటువైపు చూస్తూనే వున్నాను. తాళం తియ్యడానికి పదిహేను నిముషాలు పట్టింది. వాడికి పది రూపాయలు ఇచ్చి పంపించి తలుపు గడియ తీసారు. లోపలంతా చీకటి అన్ని తలుపులు మూసేసి వున్నాయి. ఆంటీ కిటికీ తలుపు తెరిచాక కనిపించింది అమ్మ. నగ్నంగా నేల మీద ఎముకల గూడులాంటి అమ్మ.

కొయ్యలా బిగుసుకుపోయాను. ఆంటీ చున్నీ తీసి అమ్మకి కప్పారు. అసలు బతికి ఉందా?

అమ్మా అంటూ ఏడుస్తూ అమ్మముందు కూలబడ్డాను.

"విశాఖ" అంది నీరసంగా. కళ్ళు తప్పించి, ఆ ముఖంలో ఏం మిగలలేదు. ఎముకలగూడులా వుంది.

"తొందరగా ఇక్కడ నుంచి తీసుకువెళ్ళి. ప్లీజ్!" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

రమణ, నేనూ సాయం పట్టి మెల్లిగా లేవనెత్తాం. ఇంతలో ఆంటీ నైటీ తెచ్చి అమ్మకి వేసారు. పొదివి పట్టుకున్నాను.

"రమణా! ముందు ఈవిడని హాస్పటల్‌కి తీసుకువెళదాం. నాకు తెలిసిన నర్సింగ్ హోమ్ వుంది" ఆంటీ చెబుతుండగానే అంకుల్ తెచ్చిన ఆటోలో అమ్మతో పాటూ కూర్చున్నాము. వెనకాల బైక్ మీద ఆంటీ, అంకుల్.


అమ్మను చూస్తున్న నాకు మనసంతా అల్లకల్లోలంగా వుంది.

డాక్టర్ అన్ని పరీక్షలు చేసాక "బతకడం చాలా కష్టం. రెండు రోజులు ఇక్కడ వుంచండి. కొద్దిగా ఓపిక వచ్చాక మీ ఊరు తీసుకువెళ్ళొచ్చు" అన్నారు.

హాస్పటల్ రూమ్‌లో మంచం మీద అమ్మ నిద్రపోతోంది. చాలా నిశ్చింతంగా. తెలివి వచ్చినప్పుడల్లా "విశాఖ" అంటుంది, నవ్వుతుంది. ఆ నవ్వులో ఆనందం. నేను కనిపించిన ఆనందం. పిన్ని కొడుకుని రమణని చూసి పొంగిపోయింది. "అమ్మ ఎలా ఉందిరా? ఎక్కడుంది? అంటూ అడిగింది. "విశాఖ తొందరగా ఊరు వెళ్ళిపోదాం, అమ్మ నాన్నలకి క్షమాపణ చెప్పాలి".

"వెళ్దాం. టికెట్లు దొరకగానే వెళ్ళిపోదాం" అన్నాను. అమ్మని ఎన్నో అడగాలనుకున్నాను. ఏళ్ళ తరబడి రిహార్సల్స్ వేసాను, ఏమీ అడగలేకపోయాను. అమ్మని చూస్తూ ఉండిపోయాను. అమ్మని ఇటువంటి పరిస్థితిలో కలుసుకుంటానని అనుకోలేదు. మనసంతా ఖాళీగా అయిపోయింది.

ఏం అడగాలి? ఏం చెప్పగలదు. చావు ముంచుకొస్తుంటే... రమణ మర్నాటికి టికెట్లు తెచ్చాడు. కాని ఒక్క కోరిక మిగిలిపోయింది. ఆ దుర్మార్గుడిని ఒక్కసారి చూడాలి. వాడికి నా భాష రాకపోయినా, మనసారా తిట్టిరావాలి, నాన్నను వదిలేసి నీ దగ్గరకి వస్తే ఇంత నరకం చూపిస్తావా? జాలి లేదా? బిడ్డని కూడా ఒదులుకొని నీ దగ్గరకి వస్తే ఇదా నువ్వు చేసే న్యాయం. ఇలా ఎన్నో అడగాలి. ఆ టైముకి ఏది అనిపిస్తే అది. కాని వాడ్ని ఒక్కసారి చూడాలి.



ఆంటీ ఇంటి గుమ్మంలోకి వచ్చి డోర్ బెల్ కొడుతుండగా చూసాను అమ్మ వున్న వాటాకి తాళం లేదు. ఆశ్చర్యంగా అనిపించింది. మరో ఆలోచన లేకుండా బెల్ మోగించాను. తలుపు తెరుచుకుంది. ఎదురుగా నాన్న. ఆశ్చర్యపోయాను. ఇంకా లావుగా అయిపోయాడు కింద చాపమీద ఇంకో స్త్రీ పడుకునుంది.

"రమణా! అమ్మ పడుకుంది, నేను ఒక్కసారి ఇందిరా ఆంటీ ఇంటికి వెళ్ళి మనం రేపు వెళ్ళిపోతున్నాం అని చెప్పి వస్తాను".

"ఎందుకు అక్కా! ఆంటీవాళ్ళు సాయంకాలం వస్తున్నారుగా".

"లేదురా! నేను ఒక్కసారి వెళ్ళివస్తాను" అంది.

"సరే. జాగ్రత్తగా వెళ్ళు, దారి తెలుసుగా. రిక్షాలో వెళ్ళు. దగ్గరేగా!" అన్నాడు అక్కడున్న బెంచిమీద వాలుతూ.

"సరే. నువ్వు కూడా నిద్రపో. నేను తొందరగానే వచ్చేస్తాను".

ఆంటీ ఇంటి గుమ్మంలోకి వచ్చి డోర్‌బెల్ కొడుతుండగా చూసాను అమ్మ వున్న వాటాకి తాళం లేదు. ఆశ్చర్యంగా అనిపించింది. మరో ఆలోచన లేకుండా బెల్ మోగించాను. తలుపు తెరుచుకుంది. ఎదురుగా నాన్న. ఆశ్చర్యపోయాను.

ఇంకా లావుగా అయిపోయాడు కింద చాపమీద ఇంకో స్త్రీ పడుకునుంది.

"విశాఖా! నువ్వా? ఏంటి ఇలా వచ్చావు. చాలా మారిపోయావు" తడబడుతున్న నాన్న మాటలు...

గిర్రున వెనక్కి తిరిగాను. మనసంతా కోపంతో ఉడికిపోతోంది.

ఊహించని దృశ్యం. అంటే నాన్నే అమ్మని బంధించి ఇన్నాళ్ళు నాటకం ఆడాడా?!

"విశాఖ! ఏంటీ అసలు ఈ ఊరు ఎప్పుడొచ్చావు. మాట్లాడవేం".

కోపంతో రగిలిపోతోంది విశాఖ.

ముందూ వెనకా ఆలోచించలేదు. ఈడ్చి నాన్న చెంపమీద లాగి కొట్టింది. చాప మీద పడుకున్న స్త్రీ ఒక్క ఉదుటున లేచింది. ఏదో తిడుతోంది.

పిచ్చి కోపంలో ఆమెని తోసేస్తూ "నోర్ముయ్ ఇంకొక్క మాట మాట్లాడావంటే మర్యాద దక్కదు" విశాఖ ఉద్రేకంగా ఊగిపోతోంది.

ఎదురుగా గూట్లో తాళం కప్ప. వాళ్ళిద్దరూ తేరుకునేలోపల తలుపు వేసి బయటినుంచి తాళం వేసింది.

లోపల్నించి ఇద్దరూ తలుపులు బాదుతూ అరుస్తున్నారు. తిడుతున్నారు.

"ఒరేయ్ నాన్నా! అమ్మకి నువ్వు వేసిన శిక్షకన్నా ఇది చాలా తక్కువ. అమ్మ పరువు పోగొట్టావు. నన్ను అమ్మకు దూరం చేసావు. ఈ శిక్ష నీకు చాలదు" పిచ్చిదానిలా గట్టిగా అరుస్తోంది.

ఇందిరా ఆంటీ పరుగెత్తుకుంటూ వచ్చింది. "విశాఖా ఏమైంది".

ఎవరికీ సమాధానం చెప్పలేదు. గబగబ రోడ్డు మీదకి వచ్చి ఆటోలో కూలబడి ఎడ్రస్ చెప్పాను. దుఃఖం పొర్లుకొస్తోంది. హాస్పటల్‌లో అమ్మ.

"అమ్మా" అంటూ అమ్మ మీద వాలిపోయి ఏడ్చాను. ఏళ్ళ తరబడి ఏడ్చిన ఏడుపు అమ్మని ఎన్నోసార్లు తిట్టుకున్నందుకు ఏడ్పు. నాన్నని నమ్మి అమ్మ నడత మీద అనుమానం పడినందుకు ఏడ్పు... కరిగిపోవాలి... చిన్నప్పటి నుంచి అమ్మని మరో రకంగా ఊహించుకుని మధనపడ్డ రాత్రుళ్ళన్నీ కరిగిపోయేలా ఏడ్పు...

"విశాఖ" అంటూ పొదువుకుంది.

ఎముకల్లాంటి చేతులు ఆత్రంగా గట్టిగా పట్టుకున్నాయి. "ఎందుకమ్మా... ఏడుస్తావు. నీ వల్ల నా కష్టాలు తీరిపోయాయి. నిన్ను చూడకుండా చచ్చిపోతాననుకున్నాను. "విశాఖా! పసిపిల్లని వదిలేసాను. పాలు తాగే పిల్లని వదిలేసాను... చూసావుగా తల్లీ! నువ్వు నాతోపాటే వుంటే నాలాగే అయ్యేదానివి. చదువు సంధ్యా ఏమీ వుండేవీ కావు. ఆ కామపిశాచికి నువ్వు బలి అయిపోయేదానివి. అందుకే నిన్ను వదిలేసి వచ్చాను. నన్ను క్షమించురా" ఏడుస్తూనే వుంది.

దగ్గు తెరలు తెరలుగా వచ్చింది. ఆయాసపడిపోతోంది.

కంగారుగా డాక్టర్‌ని పిలిచాను.

"మీరు మీ ఊరు ఎంత తొందరగా తీసుకెళ్ళగలిగితే అంత మంచిది..." అన్నాడు డాక్టర్.

ఇందిరా ఆంటీ హడావుడిగా లోపలికి వచ్చారు. "ఏంటి విశాఖ ఏమైంది. పిలుస్తుంటే వెళ్ళిపోయావు?"

"ఆంటీ ఆ దుర్మార్గుడు మా నాన్నే ఆంటీ... మా నాన్న..."

"మరి ఇన్నాళ్ళు మీ నాన్న కాదనుకున్నావా?" కథంతా చెప్పాను.

"ఆంటీ అమ్మని తొందరగా మా ఊరు తీసుకువెళ్ళాలి..."

"టాక్సీలో వెళ్ళిపోండి. నేను అంకుల్‌కి చెప్తాను. సాయంకాలం బయలుదేరితే పొద్దున్నే చేరిపోవొచ్చు.

ఆ టికెట్లు ఇలా ఇవ్వు. కేన్సిల్ చేయిస్తాను" గంట తర్వాత టాక్సీ వచ్చింది.

టాక్సీలో అమ్మని జాగ్రత్తగా పడుకోపెట్టాను. ఇందిరా ఆంటీ కాళ్ళని నమస్కరించాను. మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను ఆంటీ".

"ఫరవాలేదు. తల్లీ కూతుళ్ళు కలుసుకున్నారు. నాకు చాలా సంతోషంగా వుంది. కొంచెం ముందుగా మీ అమ్మ ఈ పని చేసుంటే ఆవిడ బతికేవారేమో!! నీతో గడిపేవారేమో!"

'విశాఖ' మీ నాన్న కాలనీలో చాలా హడావుడి చేసాడు. ఎవరో తన భార్యని ఎత్తుకుపోయారన్నాడు. గోల గోల చేసాడు. పోలీసులని పిలిచాడు. నేను తివారి ఆంటీకి అంతా చెప్పాను. వాళ్ళు పోలీసులతో మాట్లాడారు.

అయినా వాళ్ళు కేసు రాసుకున్నారుట. భయపడకు. నిజం బయట పడుతుంది.

ఇప్పటికైతే ఎవరు తీసుకువెళ్ళారో ఎవరూ చెప్పలేదు కాలనీలో.

టాక్సీ బయలుదేరింది.

రాయపూర్ సిటీని, హాస్పటల్‌ని, ఆంటీని అందర్నీ దాటుకుంటూ.

విశాఖపట్టణం వైపు పరుగులు తీస్తోంది.

విశాఖ పట్టణం దాటి కొన్ని గంటలు దూరంలో వున్న పల్లెటూరి వైపుకి ప్రయాణం.

ముందు సీటులో రమణ వెనక సీటులో నా ఒడిలో తల పెట్టుకుని అమ్మ...

అన్ని వింటోంది. అన్ని చూస్తోంది.... నా ఒడిలో తల పెట్టుకుని.

మాట్లాడడం మొదలుపెట్టింది.



పర్సులో తాళం చెవి చేతికి తగిలినప్పుడల్లా, గెలిచానన్న భావం, ఏదో సాధించానన్న గర్వం... ఒక్క రోజైనా చాలు, ఆ మృగాన్ని ఆ ఇంట్లో బందీ చేయగలిగానన్న తృప్తి. ఇందిరా ఆంటీకి ఫోను చేసి చెప్పాను అమ్మ పోయిందని.

"విశాఖ! అతను నాతోపాటే రాయపూర్ స్కూల్లో హిందీ టీచర్. మంచి మాటలతో నన్ను నమ్మించాడు. అతడికి అదివరకే పల్లెటూరి అమ్మాయితో పెళ్ళి అయిపోయింది. చాలా పొలాలు, బంగారం వున్న అమ్మాయి. కాని అతనికి ఇష్టంలేదు. నల్లగా వుంది ఒద్దనుకున్నాడు. కాని తప్పలేదు. డబ్బుకోసం ఎదిరించలేకపోయాడు. నన్ను చూసేక యిష్టం అన్నాడు. నేనూ నమ్మాను. పెళ్ళయ్యాక అసలు మనిషి ఏమిటో తెలిసింది. నా అందం చూసి అనుమానం పెంచుకున్నాడు. నువ్వు కడుపులో పడగానే స్కూలుకి వెళ్ళకుండా రిజైన్ చేయించాడు. ఇంట్లో నన్ను బంధించి బైట తాళం పెట్టి వెళ్ళిపోయేవాడు. అమ్మ నాన్నలకు చెప్పుకోలేకపోయాను. నా యిష్టప్రకారంగా చేసుకున్న పెళ్ళి. దిక్కు తోచలేదు. రెండే రెండు చీరలు. ఎక్కడ ఏ సామాను ఉంచేవాడు కాదు. ఎవర్నైనా పిలుస్తానని. తలుపులన్నీ బిగించేసేవాడు. నెలలు నిండిపోతున్నాయి. తిండి సరిగ్గా లేక మగ్గిపోతున్నాను. నా అదృష్టమో, నీ అదృష్టమో అనుకోకుండా ఓ సాయంకాలం పెద్దమామయ్య నన్ను చూడటానికి వచ్చి, నన్ను చూసి, మీ నాన్నతో గొడవపడి చీవాట్లు వేసి మన ఊరుకి తీసుకువచ్చాడు. నిన్ను కన్నాక మళ్ళీ ఆ నరకంలోకి అసలు వెళ్ళకూడదనుకున్నాను. కాని అమ్మ నాన్నల పరువు కోసం నిన్ను వదిలేసి వెళ్ళిపోయాను. "విశాఖ" లేకపోతే నాతోపాటు నువ్వు కూడ సమాధి అయిపోయేదానివి. నేను వెళ్ళడం నా మీద నేనే శిక్ష విధించుకోవడం. ఆ తర్వాత మొదటి భార్యకి నా సంగతి తెలిసింది. సరాసరి ఇంటికే వచ్చేసింది. ఆమె కూడా చివరికి నన్ను వదలలేదు. ఇంట్లో పెద్ద గొడవలే జరిగాయి. ఏం జరిగిందో, ఏం మాట్లాడుకున్నారో ఒకరోజు ఆమె కూడా వెళ్ళిపోయింది. ఒక రాత్రి మెల్లిగా అతని సెల్‌లోంచి పిన్ని నెంబరు కంఠతా పట్టి మర్నాడు పేపరు మీద రాసి ఎదురింటి ఆవిడకి ఇచ్చాను. లేకపోతే ఎవరితో చెబుతాను. నేను ఎక్కువ కాలం బతకను అని తెలిసిపోయింది. నిన్ను చూడకుండా, నా పరిస్థితిని అందరికీ చెప్పకుండా అలా ఆ ఇంట్లో చనిపోవల్సిందేనా అన్పించింది".

అంతా విని అమ్మా అంటూ ఏడ్చాను..." ఏడవకు నాకు తృప్తిగా వుంది. నీకు చెప్పుకున్నాక చాలా సంతోషంగా ఉంది. మీ అందరి మధ్యలో వుంటాను".

ఊరికి వెళ్ళిన రెండోరోజే అమ్మ మమ్మలందరిని వదిలి వెళ్ళిపోయింది...

ఇప్పుడు బాధలేదు, హాయిగా ఉంది, మనసు తేలిగ్గా వుంది.

పర్సులో తాళం చెవి చేతికి తగిలినప్పుడల్లా, గెలిచానన్న భావం, ఏదో సాధించానన్న గర్వం... ఒక్క రోజైనా చాలు, ఆ మృగాన్ని ఆ ఇంట్లో బందీ చేయగలిగానన్న తృప్తి.

ఇందిరా ఆంటీకి ఫోను చేసి చెప్పాను అమ్మ పోయిందని. చాలా బాధపడ్డారు.

"విశాఖా! వాళ్ళిద్దరూ మూడు రోజులు బందీ అయిపోయారు. తలుపులు ఎంత బాదినా కాలనీలో ఎవరమూ వాళ్ళ దగ్గరికి వెళ్ళలేదు.

సెల్‌లో డబ్బులు కూడా అయిపోయాయిట, కనిపించిన వాళ్ళందర్నీ బతిమాలాడు. తలుపు తియ్యమని వేడుకున్నాడు. అందరం పట్టనట్లు వెళ్ళిపోయాం. ఆఖరికి నాలుగోరోజు ఊరునుంచి కొడుకు వచ్చి తాళం పగలగొట్టి విషయం తెలుసుకుని, అసహ్యించుకుని అతను కూడా తాళం వేసి వెళ్ళిపోయాడు". ఆంటీ చెబుతుంటే మనసు ఆనందంతో నిండిపోయింది.

చాలు. ఒక కూతురిగా కన్నతల్లి ఋణం తీర్చుకున్నానన్న తృప్తితో పర్సులో తాళం చెవిని తన విజయానికి గుర్తుగా మరొకసారి తడిమి చూసుకుంది విశాఖ.

•